క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



ముసునూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గోపవరం ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ పాముల గంగాధర్ ఇటీవల పార్టీ రాష్ట్ర ప్రచార వింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. బుధవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన గంగాధర్‌ను ఆయన ఘనంగా సత్కరించి మాట్లాడారు. ఎంపీపీ కె.దుర్గాభవాని, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు 983 మంది హాజరు

తిరువూరు: స్థానిక వాహిని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం పాలిసెట్ పరీక్ష జరిగింది. 1181 మందిని ఈ పరీక్షకు కేటాయించగా, 983 మంది హాజరయ్యారు. ఎస్‌బీటీఈటీ నిబంధనల మేరకు పరీక్షను పకడ్బందీగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

● నూజివీడు: పట్టణంలో పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ పరీక్ష కేంద్రంలో 314 మంది విద్యార్థులకు గాను 283 మంది హాజరుకాగా 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 456 మంది విద్యార్థులకు గాను 416 మంది హాజరుకాగా 40 మంది గైర్హాజరయ్యారు.

ఆంగ్ల భాష బోధనా పద్ధతులపై అవగాహన



మైలవరం: తెలుగులో అచ్చులు, హల్లులు ఏ విధంగా ఉపయోగిస్తున్నామో అదే విధంగా ఇంగ్లిష్‌లో కూడా ఓవెల్స్, కాన్సోనెంట్స్ ఉపయోగపడుతున్నాయని సెయింట్ మెరీస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు మురళీ నాయక్ అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆంగ్ల భాష బోధనా పద్ధతులు ఓవెల్స్, కాన్సోనెంట్స్ అంశాన్ని వివరించారు. ఆయన మాట్లాడుతూ కాన్సోనెంట్స్‌కు ప్రాణం పోసేది ఓవెల్స్ అన్నారు. ఓవెల్స్ సహకారంతోనే కాన్సోనెంట్స్‌తో పదం పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, టీడీసీ నిర్వాహకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ముసునూరు: పదో తరగతి తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తప్పిన విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం ఏడున్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఆయా సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు మరింత ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. సప్లిమెంటరీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



నూజివీడు: బాల్య వివాహాలు నేరమని, పాతరావిచర్లను బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చేదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని చైల్డ్ రైట్స్ అడ్వకెసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పాతరావిచర్లలో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా ఆడపిల్లకు 18 ఏళ్ల వయస్సు నిండకుండా వివాహం చేస్తుంటే తమ దృష్టికి గాని, పోలీస్, రెవెన్యూ అధికారుల దృష్టికి గాని తీసుకెళ్లాలన్నారు. ఆలయాల్లో పూజారులు బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూఓ కె.కృష్ణవేణి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపు

● ఉపాధి పథకంలో రోడ్ల మంజూరు
● పల్లె పండుగ పేరుతో సిమెంట్ రోడ్ల నిర్మాణం
● పనులు చేసినా బిల్లులు రాక ఇబ్బందులు



నూజివీడు మండలం సీతారామపురంలో వేసిన సిమెంట్ రోడ్డు

నూజివీడు: పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకంలో మంజూరైన సిమెంట్ రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లకు ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఎదురు చూస్తున్నారు. పల్లెల్లో ఇంతకు ముందెప్పుడూ సిమెంట్ రోడ్ల నిర్మాణమే జరగనట్లు పల్లె పండుగ అంటూ హడావుడి చేశారు. పనులు లేని రోజుల్లో కూలీలకు పనులు కల్పించాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశాన్ని తుంగలో తొక్కి తమ పార్టీకి చెందిన కాంట్రాక్టర్లకు, నాయకులకు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూటమి నేతలు శ్రీకారం చుట్టారు.

నైరాశ్యంలో కూటమి నేతలు, కాంట్రాక్టర్లు

పల్లె పండుగ వారోత్సవాలని గత ఏడాది అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజలు నిర్వహించారు. పంచాయతీల తీర్మానాలు లేకుండానే కూటమి నేతలు తమ ఇష్టారాజ్యంగా రోడ్లను మంజూరు చేయించుకున్నారు. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులను విడుదల చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దాదాపు అన్ని పనులను పూర్తి చేశారు. అయితే సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామ నవమి పండుగలు పోయినా నేటికీ బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు చేసిన చోట కూటమి నేతలు, కాంట్రాక్టర్లు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు.

రావాల్సిన బిల్లుల వివరాలు

మండలం	పూర్తయిన సిమెంట్ రోడ్లు	బిల్లుల పెండింగ్ (రూ.కోట్లలో)
నూజివీడు	48	06.80
చాట్రాయి	57	05.20
ఆగిరిపల్లి	52	02.22
ముసునూరు	79	02.40

బిల్లులు వెంటనే చెల్లిస్తుందన్న ఆశతో..

కాంట్రాక్టర్లయితే కూటమి నాయకులకు కమీషన్లు ఇచ్చి మరీ పనులు చేశారు. కూటమి ప్రభుత్వం అయితే బిల్లులు వెంటనే చెల్లిస్తుందనే ఆశతో నిర్మించారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసిన వారంతా పనుల నిమిత్తం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక దిక్కులు చూస్తున్నారు. నిన్న మొన్నటి వరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదని ఆరోపణలు చేసిన కూటమి నేతలు ప్రస్తుతం తమ ప్రభుత్వంలో బిల్లుల విడుదలలో నెలకొన్న జాప్యంపై నోరు మెదపలేకపోతున్నారు. చేసిన పనులకు చేసినట్లుగా ఎం బుక్‌లో రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేసిన రెండు, మూడు రోజుల్లోనే బిల్లులు పడిపోతాయని గతంలో చెప్పిన మాటలకు, ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకపోవడం గమనార్హం.

నాణ్యత అంతంత మాత్రమే

ప్రభుత్వ ఆదేశాల మేరకు వేగంగా చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడుదల కాకపోవడంతో పలు ప్రాంతాల్లో చేసిన పనులకు సంబంధించిన క్వాలిటీపై కూడా దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం, క్యూరింగ్ కూడా సరిగా చేయనట్లు తెలుస్తోంది. రోడ్ల నాణ్యతపై పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజినీర్లు కూడా పూర్తిస్థాయిలో దృష్టి సారించనట్లు సమాచారం.

త్వరలోనే బిల్లులు విడుదల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశాం. సిమెంట్ రోడ్లకు సంబంధించి పూర్తయిన పనులకు ఎంబుక్ రికార్డింగ్ పూర్తిచేసి బిల్లులను పెండింగ్ లేకుండా అప్‌లోడ్ చేశాం. ప్రభుత్వం త్వరలోనే బిల్లులను విడుదల చేసే అవకాశం ఉంది.

– బాపిరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ, నూజివీడు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో వివిధ విభాగాల కమిటీల, నియోజకవర్గ కమిటీల నియామకం జరిగింది.

రాష్ట్ర మున్సిపల్ వింగ్ కమిటీ..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దొండపాటి నాంచారయ్య నియమతులయ్యారు.

తిరువూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

తిరువూరు యూత్ వింగ్ అధ్యక్షుడిగా దేవిశెట్టి శ్రీనివాసరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పి.సుధారాణి, రైతు విభాగం అధ్యక్షుడిగా వేడూరు గోపిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా వంకాలపాటి సాంబశివరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బంకా వెంకటేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బూక్యా రాములు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ జాకీర్ హుస్సేన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా కటారి సుశ్వేశ్వరరావు నియమితులయ్యారు. స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా గుంటక రామలక్ష్మారెడ్డి, పంచాయితీరాజ్ వింగ్‌కు జొన్నలగడ్డ ప్రేమ్ రాజు, మున్సిపల్ వింగ్‌కు తంగిరాల వెంకటరెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు మకత్రాజు రామ్మోహనరాజు, వలంటీర్స్ వింగ్‌కు ఎక్కుర్తి నరసింహారావు, గ్రీవెన్స్ సెల్‌కు కంచర్ల దుర్గారావు, వాణిజ్య విభాగానికి దేవిశెట్టి బాలకృష్ణ అధ్యక్షులుగా నియమితులయ్యారు. వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా గుడిపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా యెరిదేశి రామారావు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా మాల్‌రాజు రుక్మిణమ్మ, లీగల్ సెల్ అధ్యక్షుడిగా రేగళ్ల మోహన్‌రెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా రామవరపు ప్రసాద్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా వంగూరు వెంకటేశ్వర్లు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా సోమవరపు వెంకట మల్లికార్జున రావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా దారా కృష్ణ, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా షేక్ బాబు, ఇంటెలెక్చువల్ వింగ్ అధ్యక్షుడిగా అలసాని లాలయ్య, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా నల్లగట్ల సుధారాణి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా దార్ల ఏసుపాదం నియమితులయ్యారు.

కృష్ణారెడ్డి కుటుంబానికి అవినాష్ పరామర్శ



కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవినాష్, స్వామిదాసు తదితరులు

తిరువూరు: మండలంలోని జీ కొత్తూరులో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ శీలం కృష్ణారెడ్డి కుటుంబాన్ని బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్నివేళలా మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది ఆందోళనలు



జి.కొండూరు పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు



ఆందోళన చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

మైలవరం: చంద్రాల కమ్యూనిటీ హెల్త్ అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మైలవరం మండలం చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బంది బుధవారం ఆందోళన చేపట్టారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమం చేపట్టామని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. సీహెచ్‌ఓలుగా ఆరేళ్ల పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని, జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన పెంపుదల అమలు చేయాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్, పెండింగ్‌లో ఉన్న హెచ్‌డబ్ల్యూసీ అద్దె, కరెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. సమ్మెలో ఉన్నా ఎమర్జెన్సీలో సేవలు మాత్రం అందుబాటులో ఉంటామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో చంద్రాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన

జి.కొండూరు: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా పెండింగ్ బకాయిలు చెల్లించాలని, ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ కల్పించాలని, ఆన్‌లైన్ యాప్ పనులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులు సులభతరం

నూజివీడు: పట్టణ ప్రజలు ఎవరైనా సరే తమ సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకోవాలనుకుంటే ఎవరికి వారే స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రాన్ని సమర్పించి భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి బుధవారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రజలు మున్సిపాలిటీ నుంచి పొందిన లైసెన్స్ సర్వేయర్లు, ఇంజినీర్ల ద్వారా గ్రామకంఠం, అధికార లేఅవుట్స్, పట్టా భూముల్లో నివాసానికి భవన నిర్మాణానికి అనుమతులు పొందవచ్చన్నారు. దీనికిగాను పట్టణ ప్రణాళిక విభాగంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని, ఏమైనా అనుమానాలుంటే సంప్రదించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

రీసర్వే పారదర్శకంగా జరగాలి

తిరువూరు ఆర్డీఓ కె. మాధురి



రీ సర్వేపై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: రెండో దశ భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా జరపాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి అన్నారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో బుధవారం డివిజన్ పరిధిలోని సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందికి ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా సర్వే జరగాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు రైతులతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్‌లోని అయిదు మండలాల తహసీల్దార్లు, భూ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు, డివిజనల్ సర్వేయర్ సారంగపాణి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలల అప్పగింత

తిరువూరు: ఇటీవల తిరువూరు మండలం ఎర్రమాడు వద్ద పొలాల్లో సంచరిస్తుండగా గ్రామస్తులు పోలీసులకు అప్పగించిన ముగ్గురు బాలలు ఎట్టకేలకు తల్లిదండ్రుల వద్దకు చేరారు. పొలాల్లో సంచరిస్తున్న నాంచారమ్మ, వెంకటేశ్వరమ్మ, చెంచయ్య అనే బాలలను రెండు రోజుల కిందట ఎర్రమాడులో గ్రామ సర్పంచి బొర్రా మాధవి గుర్తించి పోలీసులకు అప్పగించారు. వీరిని పరిపూర్ణ అనాథ ఆశ్రమంలో ఉంచిన పోలీసులు తల్లిదండ్రుల ఆచూకీకై ప్రయత్నించారు. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం రామాయపట్నానికి చెందిన భూమా శ్రీను, లచ్చమ్మల సంతానంగా గుర్తించి వారికి పిల్లలను ఎస్ఐ సత్యనారాయణ అప్పగించారు.

వాహనాల తనిఖీ

ఆగిరిపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శుభశేఖర్ హెచ్చరించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద బుధవారం సాయంత్రం ఎస్ఐ శుభశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధిస్తామని ఎస్ఐ చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

176 మందికి వైద్య పరీక్షలు

మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ శంకర్ నేత్రాలయం వైద్యులు 176 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 68 మందికి కంటి శుక్లాలను గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబోజీ జాను, ఫౌండేషన్ ప్రతినిధి కట్టా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. సమీక్ష



కొండపల్లిలో శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న దృశ్యం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. అనంతరం చదివిన పుస్తకాల్లోని ముఖ్య విషయాలను విద్యార్థులతో చెప్పించి పుస్తక సమీక్ష నిర్వహించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అలాగే పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమం కొండపల్లి శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు సమాజాభివృద్ధికి దోహదపడటమే కాకుండా ప్రజలను చైతన్యవంతులను చేశాయని చెప్పారు. అనంతరం విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక సమీక్షలు, కథలు, చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి చంద్రశేఖర్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత నగరోత్సవం



తిరువూరులో వాసవీమాత నగరోత్సవం

తిరువూరు: స్థానిక శాంతినగర్‌లో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మే 3న విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న సందర్భంగా బుధవారం నగరోత్సవం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని మేళతాళాలు, కోలాట నృత్యాలతో పట్టణంలో ఊరేగించారు. శాంతినగర్ నుంచి బోస్ సెంటర్, ఫ్యాక్టరీ సెంటర్, జైబావి సెంటర్, చీరాల సెంటర్ మీదుగా నగరోత్సవం కొనసాగింది. వాసవీ మాత ప్రార్థనలు ఆలపిస్తూ మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన మహిళలు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త దారా శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, ఆర్య వైశ్య ప్రముఖులు కంచర్ల ముత్యప్రసాద్, జంగాల ప్రసాద్, మురళి, గజ్జల సీతారామారావు, జూలూరు వెంకట రమణయ్య, సురేష్, గుడిమెట్ల సతీష్, రమేష్, గుడిమెట్ల చినవెంకటేశ్వరరావు, కొల్లిపర సుబ్బారావు, నాగుబండి ప్రకాశరావు, విశ్వేశ్వరరావు, భూమా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

మైలవరం: పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని ప్రవాసాంధ్రులు గుర్రాల వెంకట కోటేశ్వరరెడ్డి అన్నారు. వెల్వడం గ్రామంలోని దివంగత లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం(1987–92) సహకారంతో వెల్వడం సెంటర్‌లో మంచినీటి చలివేంద్రం వద్ద బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రవాసాంధ్రులు లకిరెడ్డి చిన పుల్లారెడ్డి, గూడూరు నాగిరెడ్డి, డి అప్పారావు, సీహెచ్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు వద్దకు బూడిద పంచాయితీ

కూటమి నేతల మధ్య తారస్థాయికి ఆధిపత్య పోరు

ఇబ్రహీంపట్నం: బూడిద రవాణాపై కూటమి నాయకుల మధ్య ఆధిపత్య పోరు తార స్థాయికి చేరింది. ప్రజాప్రతినిధి కనుసన్నల్లో తప్ప ఎవరూ రవాణా చేయకూడదనే హుకుం జారీ చేయడంతో వారి మధ్య విభేదాలు పొడచూపాయి. ఇటీవలి కాలంలో కొండపల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ భర్త వేరుగా బూడిద రవాణా చేయడంతో స్థానిక కూటమి నాయకులు పోలీసుల ద్వారా లారీని పట్టించి కేసు నమోదు చేయించడం విభేదాలకు దారితీసింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆ నేత అక్రమ బూడిద రవాణా విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు వైరల్ అవుతోంది.

పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేశా..

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి కష్టపడి పనిచేయడంతో పాటు 2006 నుంచి 2021 వరకు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నేను, నా సతీమణి గెలుస్తూ పార్టీకి సేవలు అందించామని 18వ వార్డు కౌన్సిలర్ భర్త వాట్సాప్ మెసేజ్‌ను సీఎం చంద్రబాబుకు పంపారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తాను లారీల ద్వారా బూడిద రవాణా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు సీఎంకు తెలిపారు. ఈ మధ్య కాలంలో మేము తప్ప ఎవరూ బూడిద రవాణా చేయవద్దంటూ మండల ముఖ్య నేతలు తనను దుర్భాషలాడారన్నారు. తన లారీని టీడీపీ నాయకులే పోలీసుల ద్వారా నిలుపుదల చేయించి కక్షపూరితంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను మానసిక వేదనకు గురిచేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. టీడీపీ నాయకులపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు వాట్సాప్ పోస్ట్ ద్వారా కోరాడు. ఈ విషయంపై టీడీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికే బాధ్యతలా?

జి.కొండూరు: మండల పరిధి మునగపాడు గ్రామంలో అవినీతి ఆరోపణలతో ఇటీవల సస్పెన్షన్‌కు గురైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు తేజావతు ఫణీంద్రకు తిరిగి బాధ్యతలు అప్పగించడంపై గ్రామస్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వివరాలలోకి వెళ్తే..తప్పుడు మస్టర్లు వేసి నిధులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఫీల్డ్ అసిస్టెంటు ఫణీంద్రను ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ ఇటీవల తాత్కాలికంగా సస్పెండు చేసి విచారణకు ఆదేశించారు. అయితే దీనిపై విచారణ అనంతరం ఫణీంద్రపై పూర్తి చర్యలకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో తిరిగి బాధ్యతలు అప్పగించారు. దీనిపై ఎంపీడీఓ రామకృష్ణ నాయక్‌ను వివరణ కోరగా గ్రామంలో కూలీల సౌలభ్యం కోసం తాత్కాలికంగా విధులను అప్పగించారని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంటు ఫణీంద్ర అవినీతికి పాల్పడినట్లు విచారణలో రుజువైతే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే తొలగిస్తామన్నారు. దీనిపై గ్రామస్తులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. దొంగ చేతులకే తాళాలు ఇచ్చినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇబ్రహీంపట్నం: మామిడి తోటలో కాపలా ఉంటూ స్పృహతప్పి పడిపోయిన షేక్ జాన్‌బీ(45) చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వీరులపాడు గ్రామానికి చెందిన షేక్ సైదా తన భార్య జాన్‌బీతో కలిసి కేతనకొండ మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. భర్త కేతనకొండలో సరుకుల కోసం వెళ్లిన సమయంలో భార్య నోటి వెంట నురగలు కక్కుతూ తోటలో పడి ఉంది. అదే సమయంలో పక్కన మరో మామిడి తోట యజమాని జిలానీ పాషా షేక్ జాన్‌బీ పరిస్థితి గమనించి జూపూడిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో భర్త సైదా విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో సారా బట్టీపై దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య బుధవారం తెలిపారు. మండలంలోని జనార్దనవరంలో అతి రహస్యంగా సారా తయారు చేస్తున్న బెజవాడ శ్రీనివాసరావుకు చెందిన సారా బట్టీపై దాడి చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బట్టీ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. నూజివీడు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.